విజిలెన్స్ అధికారిగా శ్రీలలిత బదిలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎంపిడిఒగా విధులు నిర్వర్తిస్తున్న డి.శ్రీలలిత విశాఖ జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారిగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ నెల 15 వ తేదీన ఆమెను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఉదయం 12 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సన్మాన సభకు మండల అధ్యక్షులు పెంకే సత్యవతి అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సన్మాన సభలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొంటారన్నారు.

సమస్యలపై రణభేరి

- బోధనేతర పనులతో సతమతం
- డిమాండ్ల అమలులో జాప్యం చేస్తున్న ప్రభుత్వం
- సిపిఎస్ రద్దుపై నిర్లక్ష్యం
- నేటి నుంచి యుటిఎఫ్ ఉద్యమ కార్యాచరణ

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ఆందోళన (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయ సమస్యలను కనీసంగానైనా పట్టించుకోని పరిస్థితి ఉంది. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా సిపిఎస్‌ను రద్దు చేయడం లేదు. డిఎలతో సహా ఇతర బకాయిలను విడుదల చేయడం లేదు. ప్రధానంగా బోధనేతర పనులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో విద్యారంగం నానాటికీ కుంటుపడుతుంది. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేందుకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. దీనికి కారణం బోధనేతర పనులే. యాప్‌ల భారంతో అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైపోతున్న పరిస్థితి నేడు నెలకొంది. దీంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఉద్యమ బాట పట్టారు. ఈ నెల 15 నుంచి ఆర్థిక, విద్యారంగ సమస్యలపై 'రణభేరి' నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి 19వ తేదీ వరకూ కార్యాచరణను రూపొందించారు.

జిల్లాలో 1,876 ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా ఒకటి నుంచి 10వ తరగతుల్లో 2,89,634 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 6,928 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వ హయాం నుంచి బోధనేతర పనులను తప్పించి విద్యార్థులకు పూర్తిగా పాఠ్యాంశాలను బోధించే పనిని మాత్రమే అప్పగించాలని ఉపాధ్యాయులు ఉద్యమ రూపంలో కోరుతున్నారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఒత్తిడి లేకుండా బోధన సాగించేలా వాతావరణం కల్పించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని తదితర అనేక డిమాండ్లపై ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కూటమి ఏర్పడి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్యకు చెప్పుకోదగ్గ పరిష్కారం లభించలేదు. ఉమ్మడి సర్వీసు రూల్స్ ద్వారా కొన్ని సమస్యలకు పరిష్కారం చూపకుండా వ్యవస్థను బలహీన పరిచిందని తీవ్ర సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాత్కాలిక నియామకాలతో తప్ప శాశ్వత నియామకాలు లేని వ్యవస్థగా తయారైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నెలలుగా మినిమం టైం స్కేలు టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులకు పట్టడం లేదని విమర్శిస్తున్నారు.

విద్యాహక్కు చట్టం, ప్రపంచ బ్యాంక్ సాల్ట్ పథకం అమలు పేరుతో 3వ వంతు ప్రైమరీ స్కూళ్లు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయాయి. సగంపైగా హైస్కూళ్లు సింగిల్ సబ్జెక్ట్ టీచర్ స్కూళ్లుగా తయారయ్యాయి. హైస్కూళ్లలో పని చేయాల్సిన స్కూలు అసిస్టెంట్లు సర్స్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా, ప్రైమరీ స్కూలు హెడ్మాస్టర్లుగా పనిచేయాల్సిన పరిస్థితులు కల్పించారు. ఇలా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

తగ్గుతున్న బోధన పనులు

ఆన్‌లైన్ పనులకే సమయం అంతా వెచ్చించాల్సి రావడంతో బోధన పనులు పక్కకు వెళుతున్నాయి. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేందుకు ఓ పక్క సమయం సరిపోక, మరోవైపు సిలబస్ పూర్తికాక ఒత్తిళ్లు మరింత ఎక్కువ అవుతున్నాయి. సకాలంలో సిలబస్ పూర్తి చేయకపోతే అధికారుల నుంచి బెదిరింపులు ఎక్కువవుతాయని ఆందోళన తీవ్రంగా కనిపిస్తుంది. తీవ్ర మానసిక ఆందోళన ఎక్కువై కొందరు ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గుండెపోటు వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒత్తిళ్లను భరించలేక స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకునే ఉపాధ్యాయుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుంది.

ప్రయివేటుకు తరలిపోతున్నారు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పాలకులకు పట్టడం లేదు. న్యాయమైన విద్యను దిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రయివేటుకు తరలిపోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 'యోగాంధ్ర', 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్' అంటూ బోధనకు ఆటంకం కలిగించారు.

-బి.నాగమణి ఉపాధ్యాయురాలు, తాళ్లరేవు

బోధనేతర పనుల చుట్టూ...

ప్రభుత్వ ఆలోచనలు మారడంలేదు. అధికారులు తీరు ఉంటుంది. బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను ఊపిరి ఆడకుండా చేస్తున్నారు. విద్యార్థులకు నాలుగు అక్షరాలు చెప్పాలనే విధంగా కాకుండా ఆన్‌లైన్, అప్లోడింగ్ కార్యక్రమంగా 'విద్యాశక్తి' కార్యక్రమాన్ని మార్చేశారు. స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను బలవంతంగా నిర్బంధిస్తున్నారు.

-సిహెచ్. సూరిబాబు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు

15 నుంచి ఉద్యమ కార్యాచరణ

ఈ నెల 15 నుంచి యుటిఎఫ్ ఉద్యమ కార్యాచరణను రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 5 దశలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము. సెప్టెంబర్ 25న విజయవాడలో వేలాదిమందితో 'బహిరంగ సభ' జరగబోతుంది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వడం ద్వారా 'రణభేరి' మ్రోగించాలని పిలుపునిచ్చాం.

-టి.చక్రవర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సిఐటియు పతాకానికి సెల్యూట్ చేస్తున్న కార్మికులు

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - సామర్లకోట

కార్మిక చట్టాల అమలు, పని గంటల విధానం, పిఎఫ్ ఇఎస్ఐ అమలు, సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర డిమాండ్ల సాధనకు హమాలీ కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భీమేశ్వర లైన్స్ క్లబ్ భవనంలో బేవరేజెస్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఐదవ రాష్ట్ర మహాసభ జరిగింది. తొలుత సిఐటియు పతాకాన్ని బేవరేజ్ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన కడప జిల్లాకు చెందిన కార్మిక నాయకుడు పాగాల ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మదనమోహన్, రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు, ఉపాధ్యక్షులు ఎన్.ప్రసాదరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి మాట్లాడారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేయాలని, హమాలీ జట్టు అన్ని వర్గాల కార్మికులు కలిసి సమగ్ర చట్టం కోసం ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

బకాయిల కోసం 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - కాకినాడ, కరప

అరబిందో కంపెనీ నుంచి రావలసిన బకాయిలను, చట్టపరమైన చెల్లింపులను చెల్లించాలని 104 ఉద్యోగుల జిల్లా యూనియన్ నాయకులు కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావుని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత యాజమాన్యం భవ్య సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ బఫర్ ఉద్యోగులను తీసుకోవాలన్నారు. నెలకు క్యాజువల్ లీవ్ ఇచ్చే విధానం కొనసాగించాలన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ జిఒ ప్రకారం డిఇఒలకు రూ.18,500 జీతం, అలాగే డ్రైవర్లకు స్లాబ్ విధానం అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సేవలందిస్తున్న 104 వాహనాలలో మందులు కొరతలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలని,



ఎంఎల్‌ఎకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

ఇఎస్ఐ అమలు కాని ఉద్యోగులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, డివిజన్ నాయకులు హరిప్రసాద్, షేక్ ఖలీషా, శ్రీను, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీని సంఘం నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తమ న్యాయమైన కోర్కెల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెడుతున్న వారంతా విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యతను వెలికితీసేందుకు కృషి చేయాలని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా డిఎస్‌సికి శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన 23 మందిని ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికే దిశ, దశ నిర్దేశించే వారిని తయారుచేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాన్ని పొందిన వారంతా సమాజ అభివృద్ధికి దోహదపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. 23 మంది ఉపాధ్యాయులు అవార్డు గ్రహీత ఉద్యోగులు కావాలని, ఉన్నత జీవితాలకు వెళ్ళాలని ఆకాంక్షించారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ఫౌండేషన్ అందించిన సహకారం ద్వారా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదువుకున్న వారిని అభినందించారు. ఇప్పటి వరకు టిడిపి హయాంలోనే 13 సార్లు డిఎస్‌సి నిర్వహించి 1,96,600 మందికి ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఛైర్మన్ మణి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ఎఎంసి ఛైర్మన్ అడపా భరత్, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డీ ఖాశీబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహన్‌రావు, రాయి సాయి, బదిరెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన విజేతలకు ఎంఎల్‌ఎ నెహ్రూ

ఓజోన్ పొరను కాపాడుకోవడం అందరి బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ

ఓజోన్ పొరను కాపాడుకోవడం అందరి బాధ్యత అని ఎపి నేషనల్ గ్రీన్ కోర్ జిల్ల సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి చిత్రలేఖనం, ఏకపాత్రాభినయం పోటీలు జరిగాయి. స్థానిక వివేకానంద పార్క్‌లోని శాఖ గ్రంథాలయంలో జరిగిన పోటీల్లో 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పర్యావరణాన్ని కాపాడే అలవాట్లు చిన్ననాటి నుంచే అలవర్చుకుంటే భవిష్యత్తు సురక్షితం అవుతుందన్నారు. ఈ తరహా పోటీలు పిల్లల్లో చైతన్యాన్ని పెంచడంలో చాలా ముఖ్యమైన వేదికలన్నారు. ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ పిఒ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రంథాలయ పరిపాలనాధికారి ములంపాక శ్రీనివాసరావు మాట్లడుతూ చిత్రలేఖనం, ఏకపాత్రాభినయం వంటి సృజనాత్మక రంగాల ద్వారా ఈ అంశం మరింత బలంగా మేధస్సులో నాటుకుపోతుందన్నారు. పిల్లి గోవిందరాజులు ప్రదర్శించిన పర్యావరణపై పప్పెట్ షో అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో విఎస్‌వి.రమణమూర్తి, కెపిఎల్.లత, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 16వ తేదీన నిర్వహించే ప్రపంచ ఓజోన్ దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

నేడు విద్యారంగ సమస్యలపై బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని చేబ్రోలు, గొల్లప్రోలు ప్రాంతాల్లో బైక్ ర్యాలీ సాగుతుందని మండల యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఈశ్వరరావు, ఎంవి.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కాజులూరు

సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జె.రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖపరమైన నివేదికలను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో మార్కెట్ ఏరియాలో చేపట్టిన రోడ్డు పనులను పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నాణ్యత లోపించకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో జనసేన నాయకులు ఓరుగంటి వినోద్, వీరప్పరెడ్డి నరేష్, పి. రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న జయకృష్ణ

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - శంఖవరం

ప్రజలకు వివిధ సామాజిక సేవలు అందిస్తున్న సత్యదేవ లైన్స్‌క్లబ్ అన్నవరం సేవలు ప్రశంసనీయమని క్లబ్బు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆలపాటి సుబ్బారావు అన్నారు. ఆదివారం క్లబ్బు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన క్లబ్ సభ్యులు లైన్స్‌క్లబ్ ద్వారా మరిన్ని సామాజిక సేవలు అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గం అధ్యక్షులుగా అడపా సత్తిబాబు, కార్యదర్శిగా పొన్నాడ సూరిబాబు, కోశాధికారిగా బుడ్డిగ వాసు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ ఛైర్మన్ కెఆర్‌వివి. రమణ, రీజనల్ ఛైర్‌పర్సన్ చెరుకూరి ఇందిరా, న్యాయవాది భగతా శివ, సభ్యులు పర్వత జానకిదేవి, డొంకాడ గిరి, మచ్చ నాగేశ్వరావు, పంచాయతీ గుర్రాజు, నానాజీ, డిజె రమణమూర్తి, కందర్ప శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మెమొంటోను అందిస్తున్న లైన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

వాళ్లంతా 23 సంవత్సరాల క్రితం వరకు కలిసి ఆడారు, కలిసి చదివారు. కలిసి కష్టసుఖాలు పంచుకున్నారు. వాళ్లంతా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02 సంవత్సరంలో పదో తరగతి పూర్తయ్యాక ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు, అనేక విధులు నిర్వహణలకు సుదూర ప్రాంతాలకు వెళ్లిపోయారు. తమ చిన్నతనం నుంచి 10 సంవత్సరాల పాటు కలిసి ఆడి పాడి చదువుకున్న వారంతా 20 సంవత్సరాలు పాటు ఎడబాటు తర్వాత ఒకసారి కలిసే సరికి మరల చిన్నతనాన్ని నెమరు వేసుకుంటూ ఆడుతూ పాడుతూ తమ పూర్వ పాఠశాల ఆవరణలోనే ఈ ఆదివారాన్ని ఉల్లాసంగా గడిపారు. వీరిలో అనేకమంది ఇంజనీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులుగా, గృహిణిలుగా స్థిరపడ్డవారే. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండి.ఇబ్రహీంఖాన్, జహురుద్దీన్, జ్యోతి రాజు, సుబ్బారావు, అప్పాజి, రామనాథం, వెంకటరెడ్డి, సంజీవయ్య, వీరభద్ర రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తాళాబత్తుల

ప్రజాశక్తి - పెద్దాపురం

విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన సూక్ష్మ కళాఖండాల శిల్పి తాళాబత్తుల సాయి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ తనను డైరెక్టర్‌గా ఎంపిక చేసిన సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్‌కల్యాణ్, ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

కార్టూ'నిజం'

పని చేయని బోరు..పట్టని అధికారులు..

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని తలుపులమ్మ వీవర్స్ కాలనీలో మంచినీటి బోరు చెడిపోయింది. వారం రోజులు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కాలనీవాసులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో చేతివృత్తులు, పారిశ్రామిక కార్మికులు, కూలీల కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నాయి. ఈ మంచి నీటి బోరు నిర్వహణకు మున్సిపాలిటీ నుంచి సిబ్బందిని నియమించలేదు. కాలనీవాసులే ట్యాంకులో నీరు అయిపోతే మోటార్ వేస్తుంటారు. డెలివరీ ట్యాంకు, మోటారు బోరు చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. పాములు, కీటకాలు ఈ ప్రాంతంలో చేరతాయని ప్రజలు భయపడుతున్నారు. కనీసం తుప్పలు, డొంకలను తొలగించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సమయంలో మంచినీటిని పైపులైను ద్వారా మున్సిపాలిటీ సరఫరా చేస్తుంది. ఆ నీరు సరిపోక కాలనీవాసులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి నీరు వదిలినప్పుడు పనుల్లోకి వెళ్లిన కార్మిక కుటుంబాలకు బోరు నీరే పెద్ద దిక్కుగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బోరు రిపేరు చేయించాలని, స్పాట్ డెలివరీ ట్యాంకు చుట్టూ, మోటారు బోరు చుట్టూ పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, డొంకలు తొలగించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పిచ్చి మొక్కల మధ్య మోటార్ బోరు

నిరుపయోగంగా స్పాట్ డెలివరీ ట్యాంక్

54	31	42	37
41	38	53	32
35	40	33	56
34	55	36	39

గణిత చదరంతో శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

భారతదేశం గర్వించదగిన ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా ఆయనకు బెంగుళూరు క్యాప్ జెమిని మల్టీ నేషనల్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్, గణితావధాని తోటకూర సాయివంశీ గణిత చదరంతో శుభాకాంక్షలు తెలిపి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ చదరంలో అడ్డు వరుసలు మొత్తం, నిలువ వరుసల మొత్తం కర్ణాల మొత్తం ఇలా పలు విధాలుగా ఎటు కూడిన 164 వచ్చే విధంగా చదరం రూపొందించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యాక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు రాలేని అర్జిదారులు వారి యొక్క అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీల స్థితిని తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని ఆయన తెలిపారు.

పిఠాపురంలో పాడా కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పాడా పీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ జరుగుతుందని, నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి గ్రామానికి చెందిన రాసంశెట్టి శ్రీనివాస్ కుమారుడు రాసంశెట్టి కార్తీక్‌రాజాకి ఆపరేషన్ నిమిత్తం మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కు రూ.8,22,500ను ఆదివారం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రేలంగి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న చినరాజప్ప

నేరాలు ఘోరాలు

పుస్తెల తాడు చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వివాహిత మెడలోని బంగారు పుస్తెల తాడు దొంగిలించి పరారైన వ్యక్తిపై ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంపేట మండలానికి కోటపాడు గ్రామానికి చెందిన దాసరి దుర్గారాణి ఆమె భర్త కలిసి ఉండూరులో అమ్మగారి ఇంటికి ఆదివారం ఉదయం 9 గంటలకు బైకుపై బయలుదేరి వెళ్లారు. కాపవరం గ్రామ శివారున ఉన్న చెరువు వద్దకు వచ్చేసరికి వారి వెనుక నుంచి ఎవరో గుర్తు తెలియని ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చాడు. దుర్గారాణి మెడలో వున్న బంగారు పుస్తెలు తాడు (రెండున్నర కాసులు)ని లాక్కొని పరారయ్యాడు. దీనిపై ఆమె ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై అడిషనల్ ఎస్ఐ .భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో పడి వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒక వృద్ధురాలు మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి తెలిపిన వివరాలుప్రకారం. మండలంలోని లొల్ల గ్రామం వద్ద ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్‌లో ఆదివారం ఉదయం గుర్తుతెలియని మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ ఎస్.రాము అక్కడ చేరుకుని వృద్ధురాలి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్రేయపురం రజకపేటకు చెందిన అవిడ సత్యవతి (60) శనివారం పని మీద బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో మతురాలి తమ్ముడు సూర్యారావు వారి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు గాలిస్తున్నారు. లొల్ల గ్రామం వద్ద కాలువలో పడి మహిళ చనిపోయిందంటూ వారికి తెలిసింది. దీంతో వారు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చూడగా మృతి చెందిన ఆమె తన అక్క సత్యవతిగా గుర్తించారు. దీనిపై మృతురాలు తమ్ముడు సూర్యారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఐ.పోలవరం

పౌర హక్కులను కాపాడే రాజ్యాంగాన్ని పరి రక్షించుకోవలసిన బాధ్యత అందరి బాధ్యతని నియోజకవర్గ రాజ్యాంగ పరిరక్షణ సమితి పేర్కొంది. మండలంలోని కేశనకుర్రు పంచాయతీ పరిధిలోని అల్లూరి చెరువు, పెద లంక గ్రామాల్లో ఆదివారం గడప గడపకు భారత రాజ్యాంగం అనే కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యలమంచిలి సురేష్ అధ్యక్షతన జరి గిన సదస్సునుద్దేశించి కమిటీ అధ్యక్షుడు పెనుమాల సుధీర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలు, మహిళలు తమ హక్కులను తెలుసుకుని రాజ్యాధికార కాంక్ష దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టిలపై నిత్యం జరిగే దాడులను తిప్పి కొటాలంటే ఆయా వర్గాలు రాజ్యాధికార సాధనకు ఐక్యం కావాలన్నారు. విద్యావంతులైనపుడే మార్పు సాకరమౌతుందన్నారు. కార్యక్రమంలో పెదలంక గ్రామానికి సరైన రోడ్లు, డ్రెయినేజీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. వీధి లైట్లు వేయకపోవడాన్ని యువత, మహిళలు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు రెగ్యులర్ టీచర్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతు న్నారని, అంగన్‌వాడీ సెంటర్‌కు మరుగుదొడ్డి లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమ స్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి చర్యలు లేవని వాపోయారు. ఈ కార్య క్రమంలో కుంచే చినబాబు, తాటిపాక ధనబాబు, శరత్, బుడితి నాగేశ్వరరావు, గెద్దాడి దుర్గా ప్రసాద్, జి.శ్రీను, మోకా శ్రీరామ్, ఎం. వెంకటేష్, యల మంచిలి వాసు, ఖైఫ్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా కల్వర్టు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

లొల్ల లాకుల నుంచి కట్టుంగ గ్రామం వెళ్లే దారిలో అంకంపాలెం వెళ్లే ఆర్ఎస్ఎస్ ఛానల్ కాలువపై ఉన్న కల్వర్టు ప్రమాదభరితంగామారింది. కల్వర్టుకు ఇరువైపులా రైలింగ్ కూలిపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కల్వర్ట్ రోడ్డు మలుపులో ఉండడంతో ప్రమా దంగా మారింది. దీనిపై వాహనచోదకులు అధికారులకు విన్నవించిన వారు పట్టించు కున్న దాఖలాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని ఈ కల్వర్టు రెండు వైపులా రైలింగ్ నిర్మించాలని పలు కోరుతున్నారు.

భవన నిర్మాణానికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన ఉప్పులూరి గోపాలకృష్ణమూర్తి, ఇందిరాదేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1 లక్ష విరాళాన్ని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు అందజేశారు. వీరికి ఆలయం మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించి అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - రాజోలు

బి.సావరం గ్రామానికి చెందిన వికలాంగుడు చెల్లుబోయిన వీర వెంకట సత్యనారాయణమూర్తికి రాజోలు రోటరీ క్లబ్ సభ్యులు ట్రై సైకిల్ పంపిణీ చేశారు. కాకినాడకు చెందిన ప్రముఖ ఇంజినీర్ గట్టి సత్యనారాయణ మనుమరాలు సోమిశెట్టి అన్విత పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆర్థిక సహకారంతో ట్రై సైకిల్ సమకూర్చారు. రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి చేతులు మీదుగా వికలాంగునికి ట్రై సైకిల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గన్నాబత్తుల సత్యవతి, రాజోలు రోటరీ అధ్యక్షులు సోమిశెట్టి ఆంజనేయులు, సోమిశెట్టి నాగలక్ష్మి, కార్యదర్శి నామన షణ్ముఖేశ్వర రావు, మాజీ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ బసవ వర్గాలు, చిట్నీడి లక్ష్మణరావు, కసుకుర్తి రామకృష్ణ, మహ్మద్ కిశ్వర్, తాటికాయల అయ్యప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖకు ప్రథమ స్థానం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-2047లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు మొదటి స్థానం లభించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 'స్వర్ణ ఆంధ్ర 2047' లక్ష్యంతో 2047 నాటికి రాష్ట్రాన్ని ఆరోగ్యపరంగా దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. వైద్య, ఆరోగ్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రజాశక్తి ముఖాముఖీలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే...

స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యం ఏమిటి..?

ప్రతి పౌరుడి ఆరోగ్యం రాష్ట్ర అభివృద్ధికి మూలాధారం అనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర 2047 అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో పిల్లలకు పూర్తి టీకాలు, శిశు మరణాల రేటు తగ్గుదల, నవజాత శిశు మరణాల రేటు, ఐదేళ్ల లోపు పిల్లల మరణాల రేటు, మాతృ మరణాల రేటు, గర్భిణీ స్త్రీలలో రక్తహీనత నివారణ, జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సౌకర్యాలు, ఎన్‌సిడి ఫాలోఅప్, క్షయరోగం విజయవంతమైన చికిత్స రేటు, డెంగీ కేసు మరణాల నిష్పత్తి తగ్గింపు మొదలైన కీలక పనితీరు సూచికల్లో 92 శాతం రేటింగ్ సాధించాము.

పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో అందుతున్న వైద్య సేవలు..?

ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలు ప్రతి ఒక్కరికీ అందించేలా చర్యలు చేపడుతున్నాము. ప్రతి గ్రామానికి ఆరోగ్య సబ్ సెంటర్లు, అన్ని మండలాలకు పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలను ఆధునిక పరికరాలతో అభివృద్ధి చేస్తున్నాము. వైద్య సిబ్బంది బలోపేతంలో భాగంగా డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకం, విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ చేపడుతున్నాము. మాతా-శిశు ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. 100 శాతం టీకాలు, సురక్షిత ప్రసవ సదుపాయాలు, పోషకాహార పథకాలు అందజేస్తున్నాము.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఎటువంటి చర్యలు..?

మలేరియా, డెంగీ, ఫైలేరియా వంటి వ్యాధుల నిర్మూలన, జీవనశైలి వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాము. ఆరోగ్య మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాము. జిల్లా ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ స్థాయికి తీసుకెళ్లడం, టెలీమెడిసిన్ మరియు డిజిటల్ హెల్త్ రికార్డుల వినియోగం పెరిగింది. అత్యవసర వైద్య సేవలు అందించటంలో భాగంగా 108, 104 అంబులెన్స్ సేవల విస్తరణ, విపత్తుల సమయంలో తక్షణ వైద్య సహాయం అందిస్తున్నాము. సామాజిక ఆరోగ్యంపై అవగాహన, ప్రజల్లో ఆరోగ్య సాక్షరత పెంపు, వ్యసనాల నివారణ, పోషకాహారం ప్రాధాన్యం వంటి అంశాలను తెలియజేస్తున్నాము.

లక్ష్య సాధనపై మీ అభిప్రాయం..?

కలెక్టర్ మార్గదర్శకత్వం, డిప్యూటీ డిఎంహెచ్ ఒలు, అడిషనల్ డిఎంహెచ్ఒలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డాక్టర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఆరోగ్య సిబ్బంది సమిష్టి కృషితో ఈ విజయం సాధ్యమైంది. ఆరోగ్య రంగంలో అభివృద్ధి లక్ష్యాలను సాధించడం, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కోసం జిల్లా స్థాయి అధికారులు కృషి కొనసాగిస్తాము. ప్రజల ఆరోగ్య రక్షణలో సమగ్ర సేవలు అందించేందుకు, పరిశుభ్రత, తాగునీరు, మాతా-శిశు ఆరోగ్యం, అంటువ్యాధుల నియంత్రణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు వంటి విభాగాల్లో సమన్వయంతో పని చేస్తున్నాము.

జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ ప్రతినిధులు

51వ జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా బాలురు, బాలికల జట్లు ఎంపికయ్యాయి. కాకినాడ పిఆర్ కళాశాలలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లాలో వివిధ మండలాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఎన్‌టిఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే 51వ ఇంటర్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బాలుర జట్టులో ఎస్.అవినాష్, పి.హరీష్, ఎన్. వంశీ, కె.థాన్, పి.అనిల్‌కుమార్, కెఎస్ఆర్.సాయిరామ్, బి.ఎలిసా, వీర చక్ర, ఇ.నరేంద్ర, పిఎల్.నారాయణ, జి.త్రిమూర్తులు, జి.నరేష్, బి.ఫణికుమార్ ఎంపికయ్యారని తెలిపారు. బాలికల జట్టులో జి.పావని, ఎ.మౌనిక, బి.మంజులరాణి, కె.జీవన్ జ్యోతి, బిఎన్.పల్లవి, కె.అరుణ, జె.లక్ష్మీదుర్గ, మహాలక్ష్మి, వి.పాప, కె.గాయత్రి, జి.సత్యశ్రీవల్లి, పి.ఆదిలక్ష్మి, ఎజి.భవాని ఎంపికయ్యారని అన్నారు. ఈ జట్లు ఎంపికలో ఇంటర్ నేషనల్ కోచ్ సాయిప్రసాద్, ఇంటర్ నేషనల్ రిఫరీ భోగిళ్ళ మురళీకుమార్, జిల్లా కబడ్డీ అసోషియేషన్ కోశాధికారి నిమ్మకాయల కిరణ్‌కుమార్, తాళ్లూరి వైకుంఠం వైకుంఠం, ఇంటర్ నేషనల్ ప్లేయర్ శ్వేతకరణ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు రవికి సన్మానం

ప్రజాశక్తి - కాకినాడ

అధ్యక్షుడిని సత్కరిస్తున్న నాయకులు

ఎపి స్టేట్ ప్రధాన ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన కాకినాడ అర్బన్ ఎంఇఒ-2 చేవూరి రవిని ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రధానోపాధ్యాయుల సంఘం కృషి చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. సన్మాన గ్రహీత చెవ్వూరి రవి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులుగా విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి చిన్నరాజు, నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, పుల్లయ్య, యుటిఎఫ్ నేత చక్రవర్తి, ఎస్‌టియు శ్రీనివాస్, పిఆర్‌టియు నూకరాజు, ఎపియుఎస్ చలపతి, సిపిఎస్ రవికుమార్, ఎంఇఒ సంఘం నాయకులు జోసెఫ్ పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన డాక్టర్ విజయబాబు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ముద్రగడతో మాట్లాడుతున్న విజయబాబు

మాజీ మంత్రి, వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభంను ఏలేశ్వరం పట్టణ వైద్యులు డాక్టర్ ఎస్.విజయ్‌బాబు ఆదివారం కలిశారు. ముద్రగడ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు, కర్రోతు సత్యనారాయణ, అనుసూరి నాగేశ్వరరావు, కోరాడ నారాయణరావు, రౌతు సహదేవుడు, గోళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - జగ్గంపేట

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని కాత్రావులపల్లి గౌతమ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. అమలాపురం బిఆర్‌కె కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కె.అలేఖ్య, వై.జస్వంత్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సత్యనారాయణ, కరాటే మాస్టర్ టివివి. రమణ, టీచర్ లోవరాజు విద్యార్థులను అభినందించారు. భవిష్య త్‌లో మరిన్ని పోటీల్లో రాణించి మండలానికి పేరు తీసుకురావాలని కోరారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి - సామర్లకోట

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసిన వారం అవుతామని తెలుగు రైతు పార్లమెంటు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసచార్యులచౌదరి అన్నారు. ఆదివారం మండలంలోని జి.మేడపాడు గ్రామంలో తూర్పు కాపు విద్యా విజ్ఞాన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రమాద సమయాల్లో క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరం ఉంటుందన్నారు. సమాజంలో ఎవరో ఒకరికి రక్తం అవసరం అవుతుందని, కావున యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాకినాడ రోటరీ బ్యాంకు డాక్టర్ కామరాజు, సిబ్బంది రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు తూర్పు కాపు విద్యా విజ్ఞాన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహ పత్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పాలకుర్తి రవిబాబు, జనసేన నాయకులు జానా వెంకటరావు, జానా శ్రీను, కంచుమర్తి రాజన్న, తూర్పు కాపు విద్యా విజ్ఞాన సంక్షేమ సంఘం అధ్యక్షులు నూకరెడ్డి శ్రీనివాసు, ఉపాధ్యక్షులు పిల్లా సత్యనారాయణ, పటాని వెంకట్రావు, సెక్రటరీ పైలా సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ దేగల వీరబాబు, ట్రెజరర్ జామి ఏసుకృష్ణ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న వాలచర్ల వరలక్ష్మికుమారి దంపతులను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సన్మానించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పివి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్ని పథకాలు ఇచ్చిన ఉపాధ్యాయులు అందించే ఉత్తమ విద్య వల్లే వారు ప్రయోజకులు అవుతారన్నారు. మన ప్రాంత వాసి వరలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. అనంతరం అవార్డు గ్రహీతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పిలా మహేష్, సాంబబత్తుల చంద్రశేఖర్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.సాయిరాం, మండల శాఖ అధ్యక్షులు జి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎసి విజయలక్ష్మి

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసి విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాధులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీకి ఘన సత్కారం

ప్రజాశక్తి - జగ్గంపేట

గండేపల్లి మండలం ఎన్‌టి రాజాపురం మత్స్య సహకార సంఘం నూతన కమిటీని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సత్కరించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగింది. ఈ నెల 9న జరిగిన ఎన్నికల్లో ఇజ్జీన రాములు ప్యానల్ 9 మంది సభ్యులు గెలుపొందారు. ఈ నేపధ్యంలో గండేపల్లి సొసైటీ ఛైర్మన్ కంటిపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంఎల్ఎను నూతన కమిటీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎంఎల్ఎ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్‌రావు, టిడిపి నాయకులు కంటిపూడి సత్యనారాయణ, కేతిన వెంకన్నచౌదరి, కానుకలను శ్రీను, జాస్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

డివిజన్‌లో 112.4 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలో ఆదివారం 112.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. మండలాల వారీగా కోటనందూరులో 28.2, తునిలో 13.6, రౌతులపూడిలో 6.8, శంఖవరంలో 31, ఏలేశ్వరంలో 2, జగ్గంపేటలో 0.8, కిర్లంపూడిలో 4.2, ప్రత్తిపా డులో 2.6, తొండంగిలో 24.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని తెలిపారు.

ప్రొ కబడ్డీకి రామవరం యువకుని ఎంపిక

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం అంబేద్కర్ కాలనీకి చెందిన జైరాజ్ విశాఖపట్నంలో జరిగే ప్రో కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. అతనిని కూటమి నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు దొడ్డ శ్రీను, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు మొగలి గంగాధర్, టిడిపి నాయకులు మండపాక సూర్యనారాయణ, గుర్రం వీరబాబు, మరుకుర్తి గంగ, అడపా చక్రరావు, మాగంటి నాని, కాలనీ చర్చ్ పాస్టర్, ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామంలో మరిడమ్మ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాకారుల నృత్యాలు, గరగ నృత్యాలు అలరించాయి. పరిసర ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు తరలివచ్చారు.

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కరప

సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎంఎల్ఎ పంతం నానాజీ పంపిణీ చేశారు. ఆదివారం గొడారిగుంటలోని ఎంఎల్ఎ కార్యాలయంలో రూరల్ నియోజకవర్గానికి చెందిన పది మందికి కలిపి రూ.9,24,536 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పంతం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తోస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి అండగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ఇప్పటి వరకు రూరల్ నియోజకవర్గంలోని 117 మందికి కలిపి రూ.1,22,67,952 లబ్ధిని చేకూర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు భోగిరెడ్డి కొండబాబు, మండల అధ్యక్షుడు బండారు మురళి, గొడ్డటిపాలెం సర్పంచ్ గోన అనూష, నాయకులు ఆంజనేయులు, భోగిరెడ్డి గంగాధర్, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ, నక్క బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల నాగేశ్వరరావును సత్కరిస్తున్న మహిళలు

యోగా రత్న అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ

యోగ రత్న అవార్డు గ్రహీత డాక్టర్ జ్యోతుల నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక సత్కళావాహినిలో 'ఆరోగ్య ప్రదాతతో ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆధునిక యుగంలో రోగాలు బారిన అధిక శాతం ప్రజలు పడుతున్నారని అన్నారు. అటువంటి వారికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాకినాడకు సమీపంలో ప్రకృతి ఆశ్రమాన్ని అందుబాటులోకి తేవాలన్నది యోగ భారత్ ఫౌండేషన్ లక్ష్యమని ఇందుకు ఆరోగ్యాభిలాషులందరూ సహకరించాలని ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీహరి కోరారు. అనంతరం జ్యోతుల నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగ సాధకులు, ఆరోగ్యాభిలాషులు పాల్గొన్నారు.

రాట ముహూర్తం చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

ఘనంగా పందిరిరాట ముహూర్తం

ప్రజాశక్తి - యానాం

స్థానిక న్యూ బస్టాండ్ వెంకటేశ్వర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో విజయదశమి మహోత్సవాన్ని పురస్కరించుకుని పందిరి రాట ముహూర్తంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆటో యూనియన్ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి పందిరిరాట వేశారు. ఈ నెల 22 నుంచి 17వ దేవి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాలలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరారు.

ఆక్వాకల్చర్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్ షిప్ ప్రమాణాల ప్రకారం జీవవైవిధ్యం-పర్యావరణ మరియు భాగస్వామ్య-సామాజిక ప్రభావ అంచనాల కోసం ప్రజా సంప్రదింపుల సమావేశం

ఆక్వాఫార్మ్ పేరు: KVVSN INFRA PVT LTD - AQUA FARM,
చిరునామా: Korupalli, Pendayala, Nidadavolu (M), E.G Dt, AP.
GPS: 16.864840, 81.734373
సంప్రదింపు తేదీ మరియు సమయం: 25/09/2025 ఉ.10.30 hrs
స్పాన్సర్: AVANTI FROZEN FOODS PRIVATE LIMITED
మీ సూచనలు మరియు అభిప్రాయాలను:
assessments@greenranks.com ఇమెయిల్ ద్వారా తెలుపవచ్చు
గ్రీన్ రన్క్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
www.greenranks.com

ఆక్వాకల్చర్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్ షిప్ ప్రమాణాల ప్రకారం జీవవైవిధ్యం-పర్యావరణ మరియు భాగస్వామ్య-సామాజిక ప్రభావ అంచనాల కోసం ప్రజా సంప్రదింపుల సమావేశం

ఆక్వాఫార్మ్ పేరు: SRI G PANDU RANGA RAJU & OTHESRS AQUA FARM
చిరునామా: Krishnapuram (V), Thondangi (M), Kakinada Dt, AP.
GPS: 17.260610, 82.484922
సంప్రదింపు తేదీ మరియు సమయం: 24/09/2025 ఉ.10.30 hrs
స్పాన్సర్: AVANTI FROZEN FOODS PRIVATE LIMITED
మీ సూచనలు మరియు అభిప్రాయాలను:
assessments@greenranks.com ఇమెయిల్ ద్వారా తెలుపవచ్చు
గ్రీన్ రన్క్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
www.greenranks.com

ఆక్వాకల్చర్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్ షిప్ ప్రమాణాల ప్రకారం జీవవైవిధ్యం-పర్యావరణ మరియు భాగస్వామ్య-సామాజిక ప్రభావ అంచనాల కోసం ప్రజా సంప్రదింపుల సమావేశం

ఆక్వాఫార్మ్ పేరు: S.S AQUA FARM,
చిరునామా: Pulagurtha (V), Anaparthi (M), DR BRA Konaseema Dt, AP
GPS: 16.836973, 81.959784
సంప్రదింపు తేదీ మరియు సమయం: 22/09/2025 ఉ. 10.30 hrs
ఆక్వాఫార్మ్ పేరు: VVR AQUA FARM,
చిరునామా: Valuru (V), Kapileswaram (M), DR BRA Konaseema Dt, AP
GPS: 16.831439, 81.935969
సంప్రదింపు తేదీ మరియు సమయం: 23/09/2025 ఉ.10.30 hrs
స్పాన్సర్: AVANTI FROZEN FOODS PRIVATE LIMITED
మీ సూచనలు మరియు అభిప్రాయాలను:
assessments@greenranks.com ఇమెయిల్ ద్వారా తెలుపవచ్చు
గ్రీన్ రన్క్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
www.greenranks.com

ఒరిజినల్ మార్కుల మెమోలు పోయినవి

మాకా మణిదీప్ సాయి, S/o వీర వెంకట జగన్ మోహన్, ఇం.నెం.3-143, పాలంగి, ఉండ్రాజవరం (మం), తూర్పు గోదావరి జిల్లా. ఈ చిరునామా లోని నాకు చెందిన ఒరిజినల్ ఎస్ ఎస్‌సి సర్టిఫికెట్, **1104218226**నెంబర్ తో ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్కుల మెమో లు జిరాక్స్ నిమిత్తం పాలంగి నుండి ఉండ్రాజవరం వెళుతుండగా మార్గమధ్యంలో పోయినవి. దొరికిన వారు పై అడ్రస్ లోని సెల్ నెంబర్ **9866159771**కు తెలియజేయ గలరు.

మాకా మణిదీప్ సాయి
S/o వీర వెంకట జగన్ మోహన్,
ఇం.నం.3-143, పాలంగి, ఉండ్రాజవరం(మం),
తూర్పు గోదావరి జిల్లా.

ప్రకటన

మా క్లయింటు కాకినాడ జిల్లా, తొండంగి మండలం, కొత్తపెరుమాళ్ళపురం గ్రామ పంచాయితీ, ఆవుల మంద గ్రామం, డో.నెం. 1-1 రు కాపురస్తులు అంబుజాలపు శ్రీను గారి భార్య అంబుజాలపు భవాని యిచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,
మా క్లయింట్ అంబుజాలపు భవాని గారికి కాకినాడ జిల్లా, తొండంగి మండలం, కొత్తపెరుమాళ్ళపురం గ్రామ పంచాయితీ, కోన ఫారెస్టు గ్రామ రెవెన్యూలో చేరిన ఆవుల మంద గ్రామం తాలూకు సర్వే నెం. 2-4 రు, డోరు నెం.4-82 రు లో చ.గ.145.2 లేక చ.మీ.121.48 లు గల ఖాళీ నివేశన స్థలములో మా క్లయింటుకు గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్లు గల ఆర్.సి.సి. డాబా యిల్లు కలదు. సదరు ఇల్లు తాలూకు ఖాళీ స్థలము మా క్లయింటుకు **ది.25-04-2023**వ తేదీన శ్రీ తుని సబ్ రిజిష్టరు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడిన **4831/2023**రు గా క్రయదస్తావేజు రీత్యా దఖలుపడినది. సదరు 4831/2023 క్రయదస్తా వేజు లింకు డాక్యుమెంట్ అయిన **ది.23-06-2020** తేదీన శ్రీ తుని స.రి. వారి కార్యాలయములో దస్తావేజు **నెం.3257/2020** రుగా రిజిష్టర్ కాబడిన క్రయదస్తావేజును మా క్లయింటు **ది.10-08-2025** వ తేదీన పెరుమాళ్ళపురం నుండి తుని వెళ్ళుచున్న సమయంలో మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయింది. కావున సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన యడల నాకు గాని మా క్లయింటు అంబుజాలపు భవాని భర్త. అంబుజాలపు శ్రీను గారికి గాని అందజేయవలసినదిగా కోరుచున్నారు. సదరు దస్తావేజును పురస్కరించుకుని ఎలాంటి లావాదేవీలు జరిపిన యెడల మా క్లయింట్ను బైండ్ చేయవని అట్లు చేసిన యడల మా క్లయింట్ తీసుకొనే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కె.కె.ఎస్.సూర్యనారాయణ
అడ్వకేట్, పిఠాపురం,
సెల్.7013500599

ప్రకటన

గాదె నాగ వెంకట బ్రహ్మ సతీష్ తండ్రి సత్యనారాయణ మూర్తి, డోర్.నెం.10/3 మాచవరం గ్రామం అంబాజీపేట మండల కాపురస్తులు యావన్మంది ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా నాదగ్గర మాచవరం గ్రామ కాపురస్తులు నందెపు సత్యనారాయణ గారి కుమారుడు సూర్యనారాయణ అతని కుటుంబ అవసరాలు నిమిత్తం **ది.16-03-2023**న **5,00,000/- (అక్షరాలా ఐదులక్షలరూపాయిలు)** తిరిగి చెల్లించే నిమిత్తం తీసుకుని నాపేరున ది.**16-03-2023**న **తన స్వదస్తూరితో ప్రామిసరీ నోటును వ్రాసి ఇచ్చినారు.** సదరు బాకీని తిరిగి చెల్లించుటకు అతని పేరున మాచవరం గ్రామంలో ఉన్న స్థిర ఆస్తి సర్వేనెం.419-4బి విస్తీర్ణం 0.55సెంట్లు ఆస్తి యొక్క ఒరిజినల్ రిజిస్ట్రార్ దస్తావేజు ది.**19-02-2015**ను(**డాక్యుమెంట్‌నెం 410/2015 యస్.ఆర్.ఒ. అంబాజిపేట**) నాకు ఇచ్చి నా బాకీ తిరిగి చెల్లించిన తరువాత తిరిగి పట్టికెళతానని ఇచ్చినారు. **నాకు ది.11-11-2024న 10,000/- (అక్షరాలా పదివేలు రూపాయిలు) జమ చేసినారు.** అప్పటినుండి నా బాకీ అడుగుతున్నా తిరిగి చెల్లించుటలేదు. అంతేకాకుండా పై తెలిపిన ఆస్తిని అతని కూతురు పేరున గాని మరియు అతని బందువర్గం పేరున గాని సీక్రేట్‌గా బదిలి చేయుటకు ప్రయత్నం చేయుచున్నారని రుడీగా తెలియవచ్చినది. కావున ఏవన్మంది ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా నందెపు సత్యనారాయణ గారి కుమారుడు సూర్యనారాయణతో పై స్థిర ఆస్తి విషయంలో ఎటువంటి లావాదేవిలు జరపవద్దని ఒకవేళ జరిపిన సదరు లావాదేవిలు నాకుబైండ్ చేయవని తెలియజేస్తున్నాను.

గాదె నాగవెంకట బ్రహ్మ సతీష్
మాచవరం గ్రామం, అంబాజిపేట మండలం
సెల్.9440504507